# పబ్లిసిటీ

గోగినేని మణి

శేఖర్ కాలింగ్ బెల్‌పై చేయి వేయబోయేంతలోనే తలుపులు తెరుచుకున్నాయి స్వాగతం చెబుతోన్నట్టుగా చిరునవ్వుతో గుమ్మంలో నిలబడి వుంది కవిత

ఏమిటీ, నేను వస్తున్నట్లు ముందే తెలిసిందా, పిలవకుండానే తలుపులు తీశావ్? అడిగాడు శేఖర్

కవిత పెదవులపై చిలిపి చిరునవ్వొకటి చిందులు వేసింది'

ఆ అడుగుల సడి నా కెరుకే, ఆ అడుగుల వడి నా కొరకే అంది కళ్ళతో అభినయిస్తూ!

అబ్బ' అదర గొట్టేశావ్ లే' నవ్వుతూ లోపలికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు అతని కెదురుగా కవిత కూర్చుంది

నీకో శుభవార్త చెప్పాలని వచ్చాను చెబితే ఏమిస్తావో చెప్పు ముందు అన్నాడు శేఖర్

నీది కాని దేముంది నాలో నిజానికి నే వున్నది నీలో ముసి ముసి నవ్వుతో మెల్లగా చెప్పింది కవిత

భలే తప్పించుకున్నావ్ గానీ, ఏమిటివ్వాళ్ళ చాలా హుషారుగా వున్నట్లున్నావ్' అవునూ నిన్నటితో నీ ఎగ్జామ్స్ పూర్తయ్యాయి. ఈవేళ నీ బర్త్‌డే' ఫ్రెండ్స్‌తో ఏ మార్నింగ్‌షోకో చెక్కేసి వుంటావను కున్నానే, ఇంట్లోనే వున్నావ్, ఏం చేస్తున్నావ్?

నీ రూపమె భావనం నీ కోసమె జీవనం

'ఏమైంది నీ కివ్వాళ' మాటలు మానేసి పాటలు పట్టుకున్నావ్' పైత్యంగానీ చేసిందా? అల్లరిగా



నవ్వాడు శేఖర్.

కవిత ఒక్క వుదుటున లేచివచ్చి శేఖర్ ఎదురుగా రెండు చేతులూ నడుంమీద పెట్టుకుని నిలబడి పోట్లాడుతున్నట్లుగా అడిగింది–

"ఏమిటీ.... నీకు పైత్యంలా అనిపిస్తోందా? కృష్ణశాస్త్రి లాంటి మహాకవుల కవితలకి గుండె గుబాళించి పోవాలి గానీ!"

"ఏం గుబాళింపో.... నీకేమైనా అయిందేమోనని గుండెల్లో గుబులు మాత్రం మొదలైంది!" నిట్టూరుస్తూ, భయాన్ని అభినయిస్తూ అన్నాడు

"చాల్లే!" మూతి బిగించుకుని వెళ్ళి సోఫాలో కూర్చుంది కవిత

"ఇంతకీ శుభవార్త అన్నావు, చెప్పనే లేదు. ?"

"మనం సినిమాని ధైర్యం చేసి స్వంతంగా 'రిలీజ్ చేసినందుకు బాగానే నడుస్తోంది అదీ శుభవార్త! అన్ని సెంటర్స్‌కీ తిరిగొచ్చాగా. మామయ్య క్లబ్బు దగ్గిర కనుపిస్తే చెప్పి యిటు వచ్చాను " శేఖర్ మాటల్లో ఆనందం, గర్వం పోటీ పడ్డాయ్!

"ఓస్ ఇంతేనా! శుభవార్త అంటూ వూరిస్తే, ఇంకేదో అనుకున్నా ఇది నాన్నకీ, నీకూ శుభవార్త కావచ్చునేమొ కానీ నాకు మాత్రం మామూలు వార్తే! నిర్లిప్తంగా అంది కవిత.

"శుభవార్త అంటే ఏమనుకున్నా వేమిటీ? పెళ్ళి ముహూర్తాలు పెట్టారన్న సంగతేమోనని ఎదురు చూశావా?" శేఖర్ కొంటెగా నవ్వుతూ కళ్ళల్లోకి గ్రుచ్చి చూస్తుంటే, కవిత కళ్ళు అప్రయత్నంగ క్రిందికి వాలిపోయాయి

"ఏం కాదులే!" అంది కొంచెం సిగ్గుపడి

"సాయంకాలం నీ ఫ్రెండ్సుని ఎంత మందిని తీసుకుని వస్తావో చెబితే, నేను మీకు టిక్కెట్లు రిజర్వ్ చేసి వుంచుతాను హాలు దగ్గరికి టైముకి మీరు వచ్చేయండి "

కవిత ఒక క్షణం మనసులో లెక్కవేసి "అరుగురుం వస్తాం" అంది శేఖర్ వెళ్ళటానికి లేచాడు శేఖర్ స్కూటరు కనుమరుగయ్యేంత వరకూ గుమ్మంలోనె నిలబడి తర్వాత లోపలికి నడిచింది

# పబ్లిసిటీ

సాయంకాలం ఫ్రెండ్స్‌తో కలిసి కవిత సినిమా హాలు దగ్గరికి వచ్చేసరికి మేనేజరుతో మాట్లాడుతూ నిలబడివున్న శేఖర్ ఎదురొచ్చి కవిత చేతికి టిక్కెట్లు యిచ్చి వెళ్ళి పోయాడు.

వెళ్ళిపోతూన్న శేఖర్‌ని పరీక్షగా చూస్తూ, ఎవరే ఈ ఆరడుగుల అందగాడు?" ఒకమ్మాయి అడిగింది

"పేరు కూడా రాజశేఖరమే . తెలుసా!" పకపక నవ్వుతూ అంది కవిత

"నిజంగా ?!"

"నిజ్జంగా!"


"ఏమిటో! నవలల్లోని హీరోలు ఆకాశమార్గం వదిలి యిలా నేల మీదకి కూడా వచ్చేస్తున్నారు ఏమిటో " ముక్కు మీదకి జారుతోన్న కళ్ళజోడు పైకి తోసుకుంటూ, భుజా లెగుర వేస్తూ, ఆ అమ్మాయి అన్న తీరుకి అంతా ఫక్కున నవ్వారు.

"ఇంతకీ అతనికీ, నీకూ ఏమిటి బంధుత్వం?' ఇంకొక అమ్మాయి ఆరా తీసింది

"ఇప్పటి వరకూ లేదు ఏ బంధుత్వం త్వరలో ఏర్పడనున్నది ఓ మధురమైన బంధం' తన సహజ ధోరణిలో గేయంలా కవిత చెప్పింది

అమ్మ దొంగా . మా కిన్నాళ్ళూ చెప్పలేదేం? ఇద్దరు ముగ్గురు ఒక్కసారిగా అడిగారు

ఈమధ్యనే అనుకున్నారులే నాన్నగారికి వాళ్ళ ఫాదర్‌తో ఎప్పటి నుండో స్నేహం వుంది. శేఖర్ ఎమ్ ఏ పూర్తిచేసి ఈ మధ్యే వాళ్ళ బిజినెస్సులన్నీ చూసుకుంటున్నాడు. ఈ సినిమా నిర్మాతల్లో ఒకడు మా నాన్నగారితో కూడా కొంచెం పెట్టుబడి పెట్టించాడు, ఈ సినిమాకి. ఈ వ్యవహారంలో నాన్నగారికి అతనితో పరిచయం పెరిగి ఈ పెళ్ళి సజెస్ట్ చేస్తే, అతనూ, వాళ్ల పెద్దవాళ్ళూ అంతా ఒప్పుకున్నారు నాకూ ఏం అభ్యంతరం కనుపించ లేదు ఒకె అన్నాను పరీక్షలయ్యాయిగా, ఈ నెలాఖరికి నిశ్చితార్థం, ఆ పై నెలలో డింగ్ డింగ్ డింగ్" నవ్వుతూ ఆపేసింది




కంగ్రాట్సు" అంటూ అంతా ఒక్కసారిగా కవిత చేతులు పట్టుకున్నారు

"ఏయ్.. ఏయ్.. ఎందుకే కంగ్రాట్సు... ? చేతులు విదిలించుకుంటూ అంది కవిత

'ఎందుకేమిటీ, పెళ్ళి కుదిరినందుకు." అంతా కోరస్ పాడారు

"ఓహ్ .... పెళ్ళి కుదిరితేనే సంబరపడి పోకూడదే పిచ్చి తల్లులూ .. ఓ సారీ.... పిచ్చిపిల్లలూ ఆరిందాలా ఫోజు పెట్టి అభినయిస్తూ చెప్పింది.

"పుత్రోత్సాహము తండ్రికి పుత్రుడు జన్మించినపుడు కాదు, ఆ పుత్రుడు ప్రయోజకుడైనపుడు గానీ అన్నారు. అలాగే పెళ్ళి కుదరగానే సంబరపడి పోకూడదు ఆ వైవాహిక జీవితం ముచ్చటగా మూడు సినిమాలు , ఆరు షికార్లుగా సాగుతోంటే .. నేను ఆనందపడవచ్చు మీరు అభినందించవచ్చు తెలిసిందా?"

"అబ్బ! నువ్వింత విపులంగా చెప్పాక కూడా తెలియకుండా వుంటుందా? అలాగే ఆనక మీ కాపురం దివ్యంగా సాగుతున్నపుడు చెబుతాంత తల్లీ!" సాగదీసిందొక అమ్మాయి

"పేరేమిటే యిలా పెట్టారు! 'రౌడీలొచ్చారు' ఏం పేరు బాబూ యిది!"

అదే నేనూ అంటే, మిగతా పార్ట్‌నర్స్ ఈమధ్య దొంగలతో, రౌడీలతో వచ్చేపేర్లే క్లిక్ అవుతున్నాయని పట్టుబట్టారట ఈ మధ్య ఎక్కువగా సినిమాల్లో దొంగలు, రౌడీలేకదా హీరోలు మరి!' అంది కవిత

ఇదిగో మన నవ్వులూ, కబుర్లూ చూ సినిమాపేరు మీద 'రౌడీలొచ్చారు' అంటూ ఎదురుగా నిలబడ్డ వాళ్ళు జోక్ చేస్తున్నారు ఇ లోపలికి పదండి మరి" అంటూ దారి తీసిందొ అమ్మాయి

సినిమా పూర్తయ్యేసరికి కవిత మొహంలోని హుషారంతా 'టప్' అని వూదేసినట్లుగా ఎగిరిపోయింది! సినిమా ఏవరేజ్‌గా వున్నా సంభాషణలు చాలాచోట్ల అశ్లీలంగా వున్నాయి ఫ్రెండ్స్ ఏదో మాట్లాడబోయినా ఏం మాట్లాడకుండా సీరియస్ అయిపోయి ఇంటికొచ్చేసింది

రాత్రి భోజనానికి శేఖర్‌ని రమ్మంది కవిత కవిత వచ్చేసరికి కవిత తండ్రి రామారావుగారూ, శేఖర్ కూర్చుని మాట్లాడుకుంటున్నారు 'ఎలావుంది సినిమా' అని ఇద్దరూ అడిగేసరికి కవిత ఒక్కసారిగా విరుచుకు పడింది

'ఛ! ఛ! హీరో, హీరోయిన్లు క్రొత్తవాళ్ళు కూడా కాదు ఒక స్థాయికి ఎదిగిన వాళ్ళు అంత అసహ్యంగా వున్న డైలాగ్స్‌కి ఎలా ఒప్పుకున్నారో నాకర్థం కావటం లేదు ఆ రచయిత మాత్రం ఎలా వ్రాశాడు? మీరెలా ఒప్పుకున్నారు?"

రామారావుగారికీ సినిమా వ్యవహారంలో ఏం సంబంధం లేదు. శేఖర్ మాట మీద కొంచెం పెట్టుబడి పెట్టారంతే. ఇక మిగతా వ్యవహారమంతా కాబోయే అల్లుడికే వదిలిపెట్టి వూరుకున్నారు.

ఆయనసలు సినిమా కూడా చూడలేదు. అందుకే కవిత అలా మాట్లాడుతోంటే ఏమిటన్నట్టు ప్రశ్నార్ధకంగా శేఖర్ వైపు చూశారు

శేఖర్ కొంచెం ఇబ్బందిగా కదులుతూ 'ఆ పార్టనర్స్ ఇద్దరూ ఇపుడు ఇలాంటి ద్వందార్ధాలున్న డైలాగ్స్ వుంటేనే సినిమా బాగా నడుస్తుందని పట్టుబట్టారు మరి వ్యాపారం కదా, ప్రజలకేది ఇష్టమైతే అదే తీయాలి మరి" అన్నాడు

"ద్వందార్ధాలా?!" ఆశ్చర్యంగా చూస్తూ ఎత్తిపొడుపుగా అంది కవిత 'ఈ సినిమాలో మాత్రం ద్వందార్ధాల ప్రసక్తే లేదు ఒకటే అర్ధంతో డైరెక్టుగా బూతులే! ఇంత ధైర్యం ఇంతకు ముందెవ్వరూ చేయలేదు ఈ క్రెడిట్ మాత్రం మీదేలే"

"వ్యాపారం అన్నాక లాభం చూసుకోవాలిగా! ప్రజలంతా అవే ఆదరిస్తోంటే, ఏం చేస్తాం!"

'పాపం! ప్రజలంతా వచ్చి మీతో ఎపుడు విన్నవించుకున్నారటా యిలాంటి డైలాగులే కావాలని?! హీరోయిన్ పాత్ర ఓ వేశ్య స్థాయి కంటె ఏమాత్రం ఎక్కువగా లేదు! అసహ్యంగా మాట్లాడటం చీదరించుకుంటూన్నా హీరో మీద పడటం! ఛ! ఛ! ఫ్రెండ్సందర్నీ మా సినిమా అంటూ గొప్పగా తీసుకెళ్ళి సిగ్గుతో తలొంచుకుని వచ్చాను ఆవేశం, ఆవేదన ఆమాటల్లో సుళ్ళు తిరిగాయ్!

పార్టనర్స్ నలుగురున్నప్పుడు అందరి అభిప్రాయాల ప్రకారం పోవాలిగదా! అదే జరిగింది గానీ ఇందులో నాబాధ్యత చాలా తక్కువ'. నచ్చ చెబుతున్నట్టుగా అన్నాడు శేఖర్

అంతా కలిసి భోంచేశాక శేఖర్ వెళ్ళిపోయాడు

కవిత రాత్రి చాలాసేపటి వరకూ నిద్రపోలేదు ఆ సినిమా గురించి ఆలోచిస్తూనే వుంది ఆలోచించే కొద్దీ కోపం, ఆవేశం పెరిగిపోసాగాయ్ ఏదో చేయాలన్న తపన మొదలైంది! ఒక నిర్ణయానికి వచ్చి అర్ధరాత్రి దాటాక నిద్రపోయింది

ఆ మరునాడు కవిత మహిళామండలి ప్రెసిడెంటు సరోజినీదేవి ఇంటికి వెళ్ళింది కాలేజి ఫంక్షన్‌కి ఒకసారి ఆమెను ఆహ్వానించటానికి కవిత కూడా వెళ్ళింది వాళ్ళింటికి. ఆ పరిచయంతోనే ఇపుడు మళ్ళా వచ్చింది చాలాసేపు ఇద్దరూ మాట్లాడుకున్నారు ఆమరునాడు నగరంలోని కొంతమంది ప్రముఖులైన స్త్రీలను కలిసి మాట్లాడారు మహిళా మండలిలో చర్చించారు కవిత చేయాలనుకున్న పనిని చాలా మంది సమర్ధించారు సహకరిస్తామన్నారు

కవిత ఎంతో ఉత్సాహంతో ఇంట్లో ఈ వార్త చెప్పింది వినగానే కవిత తల్లి కమలమ్మ గయ్యిమంటూ విరుచుకు పడింది

"ఆడపిల్లవి, నీకిదేం బుద్ధి! ఊళ్ళో వాళ్ళందరికీ లేని ఆరాటం నీకెందుకు? ఊరేగింపులూ, సభలూ అంటూ రోడ్లమ్మట తిరిగితే నేనొప్పుకోను పైగా పైనెలలో పెళ్ళి అనుకుంటున్నాం! శేఖర్ వాళ్ళు అంతా ఏమనుకుంటారు?

అదేమిటమ్మా! మన వేలితో మనకన్నే పొడుచుకున్నట్టు మన సినిమాని విమర్శిస్తూ నువ్వు సభలు జరపటం ఏమిటి?! శేఖర్ ఏమనుకుంటాడో ఆలోచించావా?" రామారావుగారు కవితకి అనునయంగా నచ్చచెప్ప బోయారు

కవిత మాత్రం స్థిర నిర్ణయానికి వచ్చిన దానిలా ఏం మాట్లాడ కుండా వుండిపోయింది రామారావు గారు ఫోన్ చేస్తే కాస్సేపటిలోనే శేఖర్ వచ్చాడు రామారావుగారు, కమలమ్మ ఇద్దరూ చెప్పిన దాన్ని విని ఒకక్షణం నిర్ఘాంత పోయాడు! ఆ తర్వాత రెండు నిముషాలు ఆలోచించాడు అక్కడే కూర్చున్న కవిత వైపు చిరునవ్వుతో చూసాడు

"మామయ్యా, కవిత చేయాలనుకున్నది చెయ్యనివ్వండి. నాకేం అభ్యంతరం లేదు మీరేం వర్రీ కాకండి ఎవరికైనా ఏదైనా అన్యాయమని అనిపించినపుడు ప్రతిఘటించే హక్కు వుండాలి' నిదానంగా అన్నాడు శేఖర్

"ఏమిటి శేఖర్ నువ్వనేది! లక్షలు పోసి తీశావ్ ఇలాంటి ప్రచారం జరిగితే సినిమాకి ఎలాంటి చెడ్డపేరు వస్తుందో ఆలోచించావా"? రామారావు గారు ఆందోళనగా అన్నారు

శేఖర్ పెదవులపై చిరునవ్వు అలాగే వుంది

"అయినాసరే మామయ్యా. కవిత వాదనని నేనూ సమర్ధిస్తున్నాను ఈ సినిమా నిర్మాణంలో పూర్తి బాధ్యత నాదే కాదుకదా! నిర్మాత లందరికీ కనువిప్పు కలిగించాలని కవిత కోరుకుంటోంది. కానివ్వండి అన్యాయాన్ని చూస్తూ ఎదిరించలేక సహించటం కూడా చాలా క్షోభ కలిగిస్తుంది కొంతమందికి కవిత కూడా అలాంటిదే అందుకే నేనూ తనని సమర్ధిస్తున్నాను చేయాలను కున్నది చేయనివ్వండి "

శేఖర్ మాటలు విని రామారావుగారు, కమలమ్మ ఆశ్చర్యంతో బిగుసుకు పోయారు. కవిత ఆనందోద్రేకంతో ఒక్క వుదుటన లేచి శేఖర్ దగ్గరికి వచ్చి అతని చేతులను పట్టుకుని వూపేస్తూ అంది-

"శేఖర్. రియల్లీ యు ఆర్ వెరీ గ్రేట్! నష్టానికి చూసుకోకుండా న్యాయానికి సపోర్టు ఇచ్చినందుకు నా కెంత సంతోషంగా వుందో తెలుసా! ఐయామ్ ప్రౌడ్ ఆఫ్ యూ '

కవిత కళ్ళల్లో ఆనందం, గర్వం తొంగి చూసాయ్!! ఆ క్షణంలో కవితకి శేఖర్ మహోన్నతంగా కనుపించాడు కవితకి ఎంత ఆనందం కలిగిందంటే , తన కృతజ్ఞతని తెలియజేయ టానికి అతని చేతులను గాఢంగా చుంబించాలనేంత ఉద్రేకం వచ్చేసింది. కానీ తమాయించుకుని తన కృతజ్ఞతనీ, ఆరాధననీ కళ్ళతోనే తెలియ చేసింది!


నిర్ణయించుకున్న ప్రణాళిక ప్రకారం ఆ రోజు నగరం నడిబొడ్డు నుండి ఊరేగింపు బయలుదేరింది. ఎంతోమంది గృహిణులు, ఉద్యోగినులు, విద్యార్ధినులు ఉత్సాహంగా పాల్గొన్నారు నగరంలో ఆడుతోన్న 'రౌడీలొచ్చారు' సినిమాలోని అసభ్యకరమైన సన్నివేశాలకి, సంభాషణలకి తమ తీవ్ర అభ్యంతరం తెలుపుతూ, అలాంటి సినిమాలను త్రిప్పి కొట్టాల్సిన బాధ్యత మహిళల మీదే వుందని ప్రబోధించే రకరకాల స్లోగన్స్ వ్రాయబడిన అట్టముక్కలను పట్టుకుని, నినాదాలిస్తూ ఊరేగింపు సాగింది!

సభ జరిగే మైదానం వరకూ వచ్చారు

సాయంకాలం బ్రహ్మాండమైన సభజరిగింది నేటి సినిమాల తీరు తెన్నులు గురించి విమర్శిస్తూ కొందరు స్త్రీలు ప్రసంగించారు కవిత ఉపన్యాసం చాలామందిని ఆకర్షించింది

కవితకి సినిమాలు, పాటలు చాలా ఇష్టం. శెలవుల్లో ఎక్కువగా పాత, క్రొత్త సినిమాలు చూస్తూ, టేప్‌రికార్డర్‌లో పాటలు వింటూ, వాటి గురించి ఫ్రెండ్సుతో చర్చిస్తూ కాలం గడుపుతూంటుంది ఆ పరిజ్ఞానం కవిత ప్రసంగానికి బాగా ఉపయోగించింది!

దోమలు, ఈగలు చేరకుండా వుండేందుకు ఆరోగ్యం కోసం మన పరిసరాలను శుభ్రంగ వుంచుకోవాలని ఎలా అనుకుంటామో, అలాగే మన పిల్లల, మన మానసిక ఆరోగ్యం కోసం చెత్త



సినిమాలను వూళ్ళో ప్రదర్శింప బడకుండా మనం త్రిప్పి కొట్టాలి' నకిలీ మందులు అమ్మే వాళ్ళు ఎంత నేరస్థులో .. అసభ్య కరమైన సినిమాలు నిర్మించే నిర్మాతా అంతే నేరస్థుడు! అవునంటారా?' కవిత ఆవేశంతో అనగానే సభలో "అవును అవును" అనే అరుపులు ప్రతిధ్వనించాయ్!

"మునుపు సినిమాలో హీరో హీరోయిన్లు నీతులు చెప్పేవాళ్ళు. ఇపుడు ప్రేక్షకులికి బూతులు నేర్పిస్తున్నారు ఉదాహరణకి 'రౌడీలొచ్చారు' సినిమా చూస్తే, సెన్సారు వాళ్ళు చెవులు మూసుకుని సర్టిఫికెటు ఇచ్చారని ఎవరికైనా అర్థమవుతుంది.

ఈ ధోరణి ఆమధ్య విజయవంతమైన ఒక సినిమాతో మొదలైంది అందులో కొంత చౌకబారు హాస్యం వున్నా, కథ, కథనం, పాటల బాణీలు బాగుండటంతో ఆ సినిమా సక్సెస్ అయింది అయితే నిర్మాతలు మాత్రం ద్వంద్వార్థాల డైలాగ్సుతో నే సక్సెస్ అయిందని భ్రమపడి ఈ ధోరణిని సినిమా సినిమాకి పెంచటం మొదలు పెట్టారు నిర్మాతలంతా కూడా పోటీకి దీగుతున్నారు 'రౌడీలొచ్చారు' సినిమాలో ఈ ధోరణి పరాకాష్ఠకు చేరుకుంది.

సినిమాలు తీసి ప్రజలను బాగు చెయ్యక పోయినా ఫర్వాలేదు కానీ చెడగొట్టకుండా వుంటే చాలు మహానటుడు అక్కినేని అన్న మాటలు ఈ సందర్భంలో గుర్తు చేసుకోవటం సమంజసంగానే వుంటుందనుకుంటాను

'కళాఖండాలే తియ్యాలని మేం కోరటం లేదు నిర్మాతలను లాభాలను దృష్టిలో పెట్టుకుని వ్యాపారాత్మక చిత్రాలే తీసుకోమనండి కానీ అసభ్య సన్నివేశాలను, అశ్లీల సంభాషణలను మాత్రం మేం అనుమతించం' అని మనం నిర్మాతలను హెచ్చరించాలి! పైగా ఇలాంటి సినిమాలకి 'మహిళలు ఆదరిస్తున్న మహత్తర చిత్రమని' ప్రకటనలు! ఇది ఖచ్చితంగా ఆడవాళ్ళని అవమానించటమే అవుతుంది!

## పబ్లిసిటీ

ఏ హంగులు , అట్టహాసం లేకున్నా కథాబలం వున్న మంచి సినిమాలను ప్రేక్షకులు ఆదరిస్తారనే సత్యం ఎన్నిసార్లు ఋజువు కాలేదు? అయినా నిర్మాతలు ఈ సత్యాన్ని గ్రహించరు పైగా ప్రేక్షకుల ఆదరణని బట్టీ, అభిరుచిని బట్టీ తీస్తున్నాం అంటారు

ఈ ఆరోపణకి మహాకవి శ్రీశ్రీ జవాబిచ్చారు ఒకసారి 'వాసన నూనెతో వంట చేయించే హోటల్ ప్రొప్రయిటరు పరిశుభ్రమైన నూనెతో చేస్తే మా కష్టమర్సు తినరు అంటే ఎలా వుంటుంది?" అని అన్నారు గత్యంతరం లేక తింటోంటే, అదే వాళ్ళకి యిష్టమని అనుకోవచ్చా?

పాటల విషయానికి వస్తే మూడొంతుల సినిమాలలో పాటలు ఎలా వుంటున్నాయ్? పాటలంటే ప్రేయసీ ప్రియులు వాళ్ళ ప్రేమనీ, మనోభావాలనూ అందంగా వ్యక్త పరుచుకుంటు న్నట్లుగా అర్థంకదా! చాలా సినిమాల్లో డ్యూయెట్సు ఎలా వుంటున్నాయంటే హీరో, హీరోయిన్లు సిగ్గు విడిచి కోరికనీ, ఉద్రేకాన్ని చాటు కుంటున్నట్లుగా వుంటున్నాయ్!

ఆనాడు హీరో హీరోయిన్ని 'చిగురాకులలో చిలకమ్మా చిన్నమాట వినరావమ్మా' అని మధురంగా పిలిచి 'హృదయాలు కలిసి ఉయ్యాల లూగి ఆకాశమే అందుకోవాలనీ, తమ ప్రేమ బంధం 'ఎన్ని యుగాలైనా ఇగిరిపోని గంధమ'నీ మనోహరంగా వెల్లడించేవాడు తన బావాలను. మరి ఈ నాడు హీరో 'ఓలమ్మి' తిక్కరేగిందా, వళ్ళంతా తిమ్మి రెక్కిందా' అని అడుగుతున్నాడు నీ యమ్మ నా అత్తో, నా యమ్మ నీ అత్తో అని వరసలడుగు తున్నాడు భాష, భావం ఎలా వున్నాయో చూడండి!'

సభలో నవ్వులు చెలరేగాయ్!

కవితలో ఉత్సాహం యినుమడించి పోయింది. ధారావాహికంగా ప్రసంగం సాగిపోయింది

"పాటల్లో వస్త్రధారణ సంగతి చూడండి హీరోయిన్ లాయరైనా, డాక్టరైనా, సాంప్రదాయక కుటుంబంలోని స్టూడెంట్ అయినా ఎవరైనా సరే క్లబ్ డాన్సర్‌లా డ్రెస్ చేసుకోవటమే! తెలుగు సినిమా ఉన్నత శిఖరాలు ఇలా పాతాళానికి పతనమై జారిపోతుంటే మనం చూస్తూ వూరుకోవాల్సిందేనా? మనకేమీ బాధ్యత లేదా? సమాజం పట్ల గల నైతిక బాధ్యతను విస్మరిస్తున్న నిర్మాతలకు మనం బుద్ధి చెప్పనక్కర లేదా?

నిర్మాతలు, దర్శకులు, నటులు, రచయితలు, గాయకులు అంతా డబ్బుకోసం చేస్తున్నాం అంటారు మనం మాత్రం డబ్బులిచ్చి ఈ అసహ్యాన్ని ఎందుకు భరించాలి?

మనం సభలు, ఊరేగింపులూ జరిపి సెన్సారు వాళ్ళకి, వీళ్ళకి మెమొరాండంలు పంపి వూరుకుంటే నిర్మాతలకు చురుక్కుమనదు .ఒకసారి మనమే బాన్ చేసి సినిమాని త్రిప్పికొడితే తప్ప నిర్మాతలకు కనువిప్పు కలుగదు

కనుక నేను మీ కందరకూ విజ్ఞప్తి చేసేదేమిటంటే రేపటి నుండీ మహిళ లెవ్వరూ 'రౌడీ లొచ్చారు' సినిమాకి వెళ్ళకూడదు మీ పిల్లల్నీ, భర్తల్నీ కూడా వెళ్ళకుండా ప్రయత్నించండి"

ఆ విజ్ఞప్తితో కవిత తన ప్రసంగాన్ని ముగించింది కవిత తర్వాత ఇంకో ఇద్దరు మహిళలు మాట్లాడాక సభ ముగిసింది

కవిత ఇంటికి బయలుదేర బోతోంటే ఒక నలభై యేళ్ళ స్త్రీ వచ్చింది తన చేతిలో వున్న జంటగులాబీ రెమ్మని కవిత కిచ్చింది

"అమ్మాయ్ నీ ప్రసంగం నాకెంతో నచ్చిందమ్మా నువ్వుగానీ తెరవెనుక నుండి మాట్లాడి వుంటే, నీకు ఇరవై ఏళ్ళంటే ఎవరూ నమ్మరు నలభై ఏళ్ళనుకుంటారు అంతటి మానసిక పరిణితి నీమాటల్లో కనుపించింది. ఏ రంగంలోని అవినీతినయినా సరే నీలాంటి యువతీ యువకులు ప్రతిఘటిస్తే.. నానాటికీ దిగజారి పోతున్న నైతిక విలువలు కొంతయినా మెరుగు పడి, కొన్నేళ్ళ



పరిశుభ్రముగా బాగు చేసిన పచారి సరుకులు
ఫ్యాన్సీ మరియు జనరల్ గూడ్సు, నీలగిరి కాఫీ పొడి, సుగంధ
పరిమళ వక్కపొడి మరియు బాగుచేసిన నమ్మకమైన
పాతబియ్యం హోమ్ డెలివరి సౌకర్యము తో లభించును.

నేడే విచ్చేయండి!
విజయ దుర్గ కాఫీ & జనరల్ స్టోర్సు
కాళేశ్వరరావు రోడ్ (బీసెంట్ రోడ్ క్రాస్) గవర్నరుపేట, విజయవాడ-2 ఫోన్స్: SHOP 73676, RESI 65710

## త్వరలో ప్రారంభం!

### కొత్త శీర్షిక

# ఆయుర్వేద వైద్య సలహాలు

ఆంధ్ర సచిత్ర వారపత్రిక పాఠకులకి ఆరోగ్య సంబంధమైన సమస్యలపై ప్రసిద్ధ ఆయుర్వేద ఔషధాల తయారీ సంస్థ చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వైద్య నిపుణులు సమాధానాలు ఇస్తారు. పాఠకులు తమ ప్రశ్నలని "ఆయుర్వేద వైద్య సలహాలు" శీర్షిక పేర సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ–520003 అనే చిరునామాకి ఈ కింద ఇచ్చిన కూపన్ జతపరిచి పంపవచ్చును. ఒక కూపన్‌తో ఒక ప్రశ్నని మాత్రమే పంపాలి.

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఆయుర్వేద వైద్య సలహాలు

ప్రశ్న

పంపినవారి పేరు

పూర్తి చిరునామా


కయినా ఈసమాజం కొంతయినా బాగుపడుతుంద నా ఆనందాన్ని తెలియజేస్తూ, నిన్ను ఆశీర్వదిస్తూ నీకు ఏమైనా యివ్వాలనిపించి నీ ఉపన్యాసం అవ్వగానే మాయింటికెళ్ళి కోసుకొచ్చాను ఈ పువ్వుని. మాయిల్లు ఈ ప్రక్కనేలే"

ప్రశంసగా చూస్తూ అవిడ అన్న అమాటలకు కవిత ఆశ్చర్యంతో, ఆనందంతో మైమరిచి పోయింది! ఒకమంచి పని చేసినపుడు కలిగే అనిర్వచనీయమైన తృప్తితో మనసంతా నిండిపోయింది! ఒక క్షణం ఆ గులాబీ వైపు అపురూపంగా చూసింది

"ఆంటీ ఈ క్షణం నాకు కలిగిన ఆనందం, ఇన్నేళ్ళ నా జీవితంలో నాకెపుడూ కలుగలేదు! ఈ రోజుని నేనెప్పటికీ గుర్తు పెట్టుకుంటాను. మీలాంటి పెద్దల ఆశీర్వాదం, సహకారం వుంటే మేం ఏదైనా ఉత్సాహంగా చేయగలుగుతాం! మీ అభిమానానికి నా కృతజ్ఞతలు" అంది కవిత రెండు చేతులూ జోడించి

ఇంటికి కవిత కారులో కాదు, గాలిలో



తేలిపోతున్నట్లుగా వచ్చింది. ఇంటిముందు స్కూటరు కనుపించగానే 'ఓ! శేఖర్ వచ్చాడన్న మాట!' అనుకుంది ఆనందంగా

"అయ్యగారూ, శేఖరం బాబూ పైన కూర్చుని మాట్లాడుకుంటున్నారమ్మా" నౌఖరు వీరయ్య చెప్పాడు

మేడ మెట్లు ఎక్కుతూంటే, కవిత మనసులో ఒక తీయని ఊహ మెదిలింది!

'అవును! ఈ గులాబీ రెమ్మని శేఖర్‌కివ్వాలి! ఇస్తూ 'శేఖర్, నా ప్రయత్నాన్ని ప్రశంసించి ఒక గృహిణి ఆశీర్వదిస్తూ ఇచ్చిన పువ్వు యిది. నీ ప్రోత్సాహం యిచ్చిన ఊపిరితోనే నేనీ పని చేయగలిగాను. అందుకే ఇది నీకు ఇస్తున్నాను. ఇది కేవలం గులాబీ పువ్వు మాత్రమే కాదుసుమా! నా గుండెలో ఎగసి ఎగసి పడుతున్న ప్రేమభావనకి ప్రతీక కూడా!" అని చెప్పాలి అనుకుంది మనసులో

పైకి వెళ్ళి బాల్కనీలోకి వెళ్ళబోతూ తన పేరు వినిపించటంతో కవిత అక్కడే ఆగిపోయింది

శేఖర్ అంటున్నాడు-

"మామయ్యా, కవిత ఈ ఊరేగింపులూ, సభలూ జరుపుతానంటే ఎందుకు ఒప్పుకున్నాననుకున్నావా? నేనేం తెలివి తక్కువ వాడిని కాదు పైలివల్లో సినిమాని బేన్ చేయకుండా నేను మేనేజ్ చేసుకోగలను అఫ్‌కోర్స్ సినిమాకి చెడ్డపేరే వస్తుందనుకో, అయినా కవిత చేసిందంతా సినిమాకి బ్రహ్మాండమైన "పబ్లిసిటీ'గా పనికొస్తుంది 'చూడు! ఇపుడు కొంచెం, అటూ, యిటూగా వున్న కలెక్షన్సు రేపటి నుండీ బాగా పుంజుకుని హౌస్‌ఫుల్‌గా నడుస్తుంది గ్యారంటీగా!"

అమ్మాయికి తెలిసే ఫీలవుతుందేమొ అది ఆలోచించావా?" తండ్రి అంటున్నాడు

"మామయ్యా, జీవితంలో నేను ప్రాముఖ్యత నిచ్చేది మొదట 'మనీ'కి ఆ తర్వాతే మనిషి! మనీ వుంటే మనుష్యులంతా మన చుట్టూనే తిరుగుతారు

శేఖర్ మాటలు విని నిర్విణ్ణురాలై అలాగే నిలబడిపోయింది కవిత

హాయ్ కవితా! ఏమిటీ అలా శిల్ప సుందరిలా నిలబడిపోయావ్' హుషారుగా అన్నాడు శేఖర్ దగ్గిరికి వచ్చి

అప్పటికి షాక్ నుండి కొంచెం తేరుకుంది కవిత కళ్ళెత్తి శేఖర్ వైపు క్రొత్త వ్యక్తిని చూసినట్లుగా విస్మయంగా చూసింది అతని అంతరంగాన్ని తరిచి తరిచి చూస్తున్నట్లుగా నిశితంగా చూస్తూ రెండు క్షణాలు అలాగే నిలబడి పోయింది

'శేఖర్, ఈ పువ్వుని ఒక గృహిణి నన్ను మెచ్చుకుంటూ ఇచ్చింది నాకు నచ్చిన వ్యక్తికి నా ఆనందానికి, ప్రేమభావనకి గుర్తుగా ఇవ్వాలని అనుకున్నాను" చేతిలోని జంటగులాబీ వైపు చూస్తూ మెల్లగా అంది

"మరింకేం! ఎదురుగానే వున్నానుగా! ఇవ్వుమరీ!" సరదాగా భుజాలెగుర వేస్తూ అన్నాడు చిరునవ్వుతో

'శేఖర్ నీ మాటలు ఇపుడే విన్నాను ప్రేమకి నీ జీవితంలో ప్రథమ స్థానమైతే సంతోషించేదాన్ని. నీతి, నిజాయితీలకైతే. గర్వపడే దాన్ని! కానీ నీ ఆలోచనలు వేరుగా వున్నాయ్! రేపు నీ భార్య కూడా చెడ్డపేరు తెచ్చుకుని అయినా డబ్బు సంపాదిస్తే ఆనందిస్తా వనుకుంటా. కోపం ఎందుకు ..! నువ్వు చేసిన పని అంతకన్నా ఎక్కువైందేం కాదులే!"

బిగుసుకున్న కవిత పిడికిలిలో జంటగులాబీ నలిగి నేలరాలి పోయింది!

అక్కడ నుండి వెళ్ళబోతూ ఒక క్షణం ఆగి శేఖర్ కళ్ళల్లోకి నిశితంగా చూస్తూ, దృఢంగా చెప్పింది కవిత-

"డబ్బు కూడా ముఖ్యమైతే ఫర్వాలేదు. కానీ డబ్బే ముఖ్యమనుకునే మనిషిని నేనెప్పటికీ ప్రేమించ లేను!" □